విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

- కలెక్టర్ సత్యప్రసాద్
- ఇబ్రహీంపట్నం ఆదర్శ పాఠశాల సందర్శన

విద్యార్థితో బోర్డుపై హిందీ అక్షరాలు రాయిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

ఇబ్రహీంపట్నం, జూలై 26: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య నందించాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో అమ్మ ఆదర్శ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, నాణ్యమైన విద్యనందించాలన్నారు. విద్యార్థులను పాఠ్యాంశాల్లోని పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు చదవడం, రాయడం, గణితం, హిందీ, ఇంగ్లిష్ సిలబస్‌లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు ఆంగ్లం లోనే బోధించాలన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం గ్రామంలో పర్యటించి మురుగు కాలువలను పరిశీలించారు. మురుగు కాలువలను శుభ్రంగా ఉంచడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లాలని గ్రామపంచాయతీ సిబ్బందికి సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

వర్షాలు కురుస్తున్నందున జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. ఎర్రండి శివారులోని గోదావరి తీర ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. గోదావరి తీర ప్రాంత ప్రజలు నదిలోకి వెళ్లవద్దని సూచించారు. ప్రమాదకరమైన చెరువులు, కుంటల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్ రెడ్డి, తహసీల్దార్ ప్రసాద్, ఏఈవో ఆనంద్ రావు, ఆర్ఐ రమేశ్, ప్రిన్సిపాల్ నవీన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో వర్షం

జగిత్యాల టౌన్, జూలై 26: జిల్లాలో వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. శుక్రవారం అత్యధికంగా మల్లాపూర్ మండలంలో 24.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇబ్రహీంపట్నం మండలంలో 13.9, రాయికల్ మండలంలో 12.8, బీర్‌పూర్‌లో 5.8, సారంగాపూర్‌లో 12.3, ధర్మపురిలో 8.6, బుగ్గారంలో 10.6, జగిత్యాల రూరల్‌లో 9.1, జగిత్యాలలో 10.6, మేడిపల్లిలో 8.2, కోరుట్లలో 9.5, మెట్‌పల్లిలో 13.2, కథలాపూర్‌లో 5.7, కొడిమ్యాలలో 5.9, మల్యాలలో 6.0, పెగడపల్లిలో 14.4, గొల్లపల్లిలో 14.7, వెల్గటూర్‌లో 14.1, ఎండపెల్లిలో 17.9, భీమారంలో 8.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

హామీలను అమలు చేయాలి

జగిత్యాల రూరల్, జూలై 26: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని జిల్లా ఉద్యమకారుల సంఘం చైర్మన్ జవాజి శంకర్ కోరారు. జిల్లా కేంద్రంలోని ఉద్యకారుల సంఘ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల స్థలంతో పాటు పింఛన్ ఇవ్వాలని, అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యమకారుల సమస్యలపై చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాగుల రాజు, గంగారెడ్డి, మెరుగు గంగస్వామి, చింతల గంగాధర్, నాచుపల్లి రెడ్డి, శేఖర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కొడిమ్యాల, జూలై 26: మండలంలోని నాచుపల్లి జేఎన్టీయూలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కాగా, జగిత్యాల రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది 20 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ప్రవీణ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి మంచాల కృష్ణ, టీవీ సూర్యం, ముత్తు తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- జిల్లా వైద్యాధికారి సమీయొద్దీన్

ఇంటి ఆవరణలో ఉన్న పాత టైర్లను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి సమీయొద్దీన్

మల్లాపూర్, జూలై 26: ప్రజలు డెంగ్యూ ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి సమీయొద్దీన్ సూచించారు. మండలంలోని ముత్యంపేటలో ఇద్దరికి డెంగ్యూ పాజిటివ్ రాగా, బాధితుల ఇండ్లతో పాటు గ్రామంలోని వీధులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ, ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామంలో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, మండల వైద్యాధికారి వాహిని, ఎంపీవో జగదీశ్, సీహెచ్‌వో రాంమోహన్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

- జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యుడు, పక్కన జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

జగిత్యాల రూరల్, జూలై 26: ప్రతి ఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ సూచించారు. మండలంలోని ధరూర్ గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య సిబ్బంది గ్రామస్తులకు వివిధ పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం జిల్లా ఉపవైద్యాధికారి గ్రామంలో పర్యటించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటి వరకు 62 డెంగ్యూ కేసులు నమోదైనట్లు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ బెనర్జి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్ల, జూలై 26: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెప్మా అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. పట్టణంలోని మున్సిపల్ స్త్రీ శక్తి భవనంలో మెప్మా ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులకు శుక్రవారం మహిళా శక్తి పథకంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు చేయూతనందిస్తామని తెలిపారు. వచ్చే ఏడాది వరకు రూ. 2.89 కోట్ల రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మహిళా సంఘాల్లో మహిళలను చేర్పించి వడ్డీ లేని రుణాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో కమిషనర్ తిరుపతి, మెప్మా ఏపీ శ్రీనివాస్ గౌడ్, డీఎంసీ సునీత, టీఎంసీ శ్రీరామ గౌడ్, మెప్మా సీవోలు, ఆర్పీలు, ఏఎల్ఎఫ్, టీఎల్ఎఫ్‌లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మెప్మా అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ శ్రీనివాస్‌గౌడ్

ఎమ్మెల్యే పరామర్శ

సారంగాపూర్, జూలై 26: నాగునూర్ గ్రామానికి చెందిన తుంగతుర్తి సతీశ్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతూ జగిత్యాలలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ శుక్రవారం దవాఖానలో సతీశ్‌ను పరామర్శించి, ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ నాయకులు తదితరులున్నారు.

కేడీసీసీబీ డైరెక్టర్‌గా సాగర్

సారంగాపూర్, జూలై 26: బీర్‌పూర్ మండలం మంగెళ గ్రామానికి చెందిన మందాటి సాగర్ కేడీసీసీబీ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. శుక్రవారం సాగర్‌ను పలువురు అభినందించారు. కాగా, తన ఎన్నికకు సహకరించిన కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావుకు ఈ సందర్భంగా సాగర్ కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ

కోరుట్ల రూరల్, జూలై 26: మాదాపూర్‌కు చెందిన బద్ధం దేవారెడ్డి ఇటీవల దవాఖానలో చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. శుక్రవారం కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ చేపూరి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు తిరుమల గంగాధర్, నాయకులు అల్లూరి మహేందర్‌రెడ్డి, పడాల లచ్చన్న, దాసరి రాజేశ్, మహేశ్, మల్లేశం, కొమురయ్య, గంగాధర్, వెంకటస్వామి పాల్గొన్నారు.

పాలాభిషేకం

మల్లాపూర్, జూలై 26: మండలంలోని ముత్యంపేట చక్కెర కర్మాగారం ఎదుట టీపీసీసీ నేత జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీ మేరకు మూతపడిన చక్కెర కర్మాగారం తెరిపించడానికి ఇప్పటికే ప్రభుత్వం మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షతన ప్రత్యేక కమిటీ వేసిందని, ఇటీవల శాసనసభలో చక్కెర కర్మాగారం కోసం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించడం హర్షణీయమని తెలిపారు. ఇక్కడ నాయకులు బాపురెడ్డి, మహేందర్‌రెడ్డి, నర్సయ్య, మహిపాల్, సదానందచారి, లింగం, రఘు, నర్సాగౌడ్, రాజేందర్, లింగారెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరు యువతుల అదృశ్యం

కథలాపూర్, జూలై 26: కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన 20 ఏళ్ల యువతి అదృశ్యం కాగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ శుక్రవారం తెలిపారు. యువతి గురువారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువుల ఇండ్లలో వాకాబు చేశారు. అయినప్పటికీ ఆచూకీ లభించలేదన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రాయికల్, జూలై 26: పట్టణానికి చెందిన ముక్కెర జ్యోతి (27) గురువారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని పోలీసులు తెలిపారు. జ్యోతి భర్త ముక్కెర రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ చెప్పారు.

గోరింటాకు వేడుకలు

మారుతీనగర్, జూలై 26: పట్టణంలోని చావిడి వద్ద గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు చేతులకు గోరింటాకు పెట్టుకొని, ప్రదర్శించారు. ఉపాధ్యాయులు రాజేందర్‌శర్మ, విజయ్‌కుమార్, మనోజ్, శేషశయన పాల్గొన్నారు.

మేడిపల్లి, జూలై 26: మండల కేంద్రంలోని శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గోరింటాకు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుందారపు మహేందర్, డైరెక్టర్లు జితేందర్, నాగరాజు, గంగాధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మేడిపల్లి, జూలై 26: మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జలందర్ రెడ్డి, భూమారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్, నారాయణరెడ్డి, తిరుపతిరెడ్డి, చారి, రహీం తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి

అల్ఫోర్స్‌లో అలరించిన స్వాగతోత్సవం

జగిత్యాల, జూలై 26: పట్టణంలోని అల్ఫోర్స్ బాలికల జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం స్వాగతోత్సవం ఏర్పాటు చేశారు. కాగా, ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 34 సంవత్సరాలుగా అల్ఫోర్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో విద్యాభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షల్లో, క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నరేందర్ రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్యాస్ సబ్సిడీ రాక లబ్ధిదారుల ఇక్కట్లు

సారంగాపూర్, జూలై 26: రాష్ట్ర ప్రభుత్వం వంట గ్యాస్‌పై ఇస్తున్న సబ్సిడీ వర్తించకపోవడంతో లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు. సారంగాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సహాయ కేంద్రం ఏర్పాటు చేయగా చాలా మంది గ్యాస్‌పై సబ్సిడీ వర్తించడం లేదని దరఖాస్తులు ఇస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంటగ్యాస్ సబ్సిడీ వర్తించేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

జిల్లా సహకార అధికారికి సత్కారం

జిల్లా సహకార అధికారిని సన్మానిస్తున్న సహకార సంఘాల చైర్మన్లు

జగిత్యాల రూరల్, జూలై 26: జిల్లా సహకార అధికారిగా నియామకమైన రఘువరన్‌ను శుక్రవారం జిల్లా సహకార సంఘాల ఫోరం ఆధ్వర్యంలో మార్యదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. సహకార సంఘాల అధ్యక్షులు మైపాల్ రెడ్డి, సందీప్ రావు, వేణుగోపాల్, నరేశ్, మల్లారెడ్డి, మాధవరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు కార్యక్రమం

పెగడపల్లి: బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

పెగడపల్లి, జూలై 26: పెగడపల్లి మండలం బతికపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేసిన ఉపాధ్యాయులు నేదరి లక్ష్మణ్, అబ్దుల్ జమీల్, ఏల్పుల శ్రీనివాస్, గోనె శివకృష్ణ బదిలీ కాగా, శుక్రవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం భారతి, ఉపాధ్యాయులు శ్రీధర్, రమేశ్, తిరుపతిచారి, నరేశ్, నాగరాణి, మంజుల, అనసూయ, సీఆర్పీ రాజమల్లు, విద్యార్థులు ఉన్నారు.

వెల్గటూర్, జూలై 26: వెల్గటూర్ ప్రాథమిక పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు ఎనగందుల రాజేశం, శిరీషకు ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ, వారి సేవలను కొనియాడారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులకు 80 గ్లాసులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోనే సత్యం, నరేశ్, సీఆర్పీ వైద్య వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్ అబద్ధాల పుట్ట

జగిత్యాల(మల్యాల), జూలై 26: రాష్ట్ర బడ్జెట్ అబద్ధాల పుట్ట అని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. మల్యాలలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. నెలకు రూ.4,000 పింఛన్ ఇస్తామని ఎన్నికల ముందు చెప్పి, బడ్జెట్‌లో ఆ ఊసేలేదని అన్నారు. సమావేశంలో బీజేపీ మల్యాల మండలాధ్యక్షుడు నేరెళ్ల శ్రావణ్‌కుమార్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, ప్రధాన కార్యదర్శి గాజుల మల్లేశం, నల్గొండ సురేశ్, బీజేవైఎం మండలాధ్యక్షుడు పిల్లి రాజశేఖర్, బావు రాకేశ్ పాల్గొన్నారు.

బీజేపీ దళిత మోర్చా ఆధ్వర్యంలో రాస్తారోకో

ధర్మపురి, జూలై 26: రాష్ట్ర బడ్జెట్‌లో దళిత, బడుగుబలహీన వర్గాలకు సంబంధించి కోటా తగ్గించడాన్ని నిరసిస్తూ బీజేపీ దళిత మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం ధర్మపురిలో జాతీయ రహదారి పై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దళితుల అభ్యున్నతికి సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గానికి కోట్ల రూపాయలు కేటాయించుకొని, ఎస్సీ రిజర్వ్‌డ్ అయిన ధర్మపురికి గుండు సున్నా కేటాయించాడని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దొనకొండ నరేశ్, అసెంబ్లీ కన్వీనర్ రాంబాబు, కో-కన్వీనర్ లక్ష్మణ్, యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ విజయ్ దివస్

మారుతీనగర్: అమర జవాన్లకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

జగిత్యాల, జూలై 26: జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్‌లో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. విశ్రాంత సైనికుడు, పాఠశాల డైరెక్టర్ బియ్యాల హరిచరణ్ రావు కార్గిల్ యుద్ధం, సైనికుల త్యాగాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో శ్రీధర్ రావు, మౌనికారావు, అజిత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల, జూలై 26: పట్టణంలోని కార్గిల్ చౌక్ వద్ద కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో అమర జవాన్లకు కొవ్వొత్తులు, కాగడాలతో నివాళులర్పించారు. అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. బీజేపీ, బీజేవైఎం, విశ్వహిందూ పరిషత్, ఏబీవీపీ నాయకులు తదితరులున్నారు.

మారుతీనగర్, జూలై 26: మెట్‌పల్లి పట్టణంలోని శాస్త్రీ చౌరస్తా వద్ద కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా లయన్స్‌క్లబ్ సభ్యులు కొవ్వొత్తులతో అమరవీరులైన సైనికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు శ్రీనివాస్, రాకేశ్, వేణుగోపాల్, పోమార్ తుక్కారాం, నర్సింహరావు, తదితరులు పాల్గొన్నారు.

రాయికల్, జూలై 26: పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో అమరులైన సైనికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలె శేఖర్, అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేడిపల్లి, జూలై 26: మేడిపల్లిలోని యూనియన్ బ్యాంక్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు మాజీ ఉపసర్పంచ్ గోస్కి మధుసూదన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. కార్యక్రమంలో యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డ్రైడే

కోరుట్ల రూరల్, జూలై 26 : మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. గ్రామ ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీవో కృపాకర్, గ్రామ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి

మేడిపల్లి, జూలై 26: గ్రామాల్లో పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని డీఎల్‌పీవో శంకర్ పంచాయతీ సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంతోపాటు కొండాపూర్, తదితర గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన డ్రైడే-డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మురుగు కాలువలను ఎప్పటికప్పుడూ శుభ్రం చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. ప్రయాణానికి చింత

రాజక్కపల్లి సబ్ స్టేషన్ వద్ద ప్రమాదకరంగా మారిన ప్రధాన రహదారి

వెల్గటూర్, జూన్ 26: కరీంనగర్-రాయపట్నం స్టేట్ హైవే మండలంలోని సబ్ స్టేషన్ సమీపంలో అడుగుకో గుంత దర్శనమిస్తున్నది. ఈ దారి గుండా వెళ్లాలంటే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాజక్కపల్లి పరిధిలోని క్రషర్స్, ఓ కంపెనీకి చెందిన వందలాది భారీ వాహనాలు వెళ్తుండడంతో ఈ దారి ప్రమాదకరంగా మారింది. మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని బుగ్గిపాలెం, రాజక్కపల్లి వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దారికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

అంబర్‌పేటను సందర్శించిన అదనపు కలెక్టర్

జగిత్యాల రూరల్, జూలై 26: ప్రజలు ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి సూచించారు. జగిత్యాల అర్బన్ మండలం అంబర్‌పేట గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను, గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీవో సలీం, కార్యదర్శి రమేశ్, ఆశ కార్యకర్త పద్మ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాల(మల్యాల)/కథలాపూర్/మేడిపల్లి, జూలై 26: గ్రామాల్లో చోరీలు జరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కథలాపూర్ ఎస్ఐ నవీన్‌కుమార్, మేడిపల్లి ఎస్ఐ శ్యామ్‌రాజ్, మల్యాల ఎస్ఐ నరేశ్‌కుమార్ శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో సూచించారు. వ్యవసాయ పనులకు, ఇతర గ్రామాలకు వెళ్లే వారు బంగారు ఆభరణాలు ఇంట్లో ఉంచుకోవద్దన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు.

గొర్రెలకాపరులు..

పెగడపల్లి, జూలై 26: భారీ వర్షాలు కురుస్తున్నందున గొర్రెలకాపరులు అప్రమత్తంగా ఉండాలని అఖిల భారత యాదవ మహాసభ మండల ప్రధాన కార్యదర్శి పలుమారు విజయ్ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. భారీ వర్షాలతో వాగులు పొంగి పొర్లుతున్నాయని, విద్యుత్ ప్రమాదాలు తలెత్తే అవకాశం ఉందని, గొర్రెలను మేపేందుకు వెళ్లే కాపరులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌ను కలిసిన జువ్వాడి

మారుతీనగర్, జూలై 26: మెట్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత-సత్యనారాయణ దంపతులను శుక్రవారం కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు లింగం, లింగారెడ్డి, అంజిరెడ్డి, లక్ష్మణ్, రాజారాం, వెంకటేశ్, భరత్, మహేందర్ ఉన్నారు.

బోనాల జాతర

కోరుట్ల, జూలై 26: పట్టణంలోని శివ మార్కండేయ కోటి నవదుర్గా ఆలయంలో ఆలయ నిర్వహణ కమిటీ, 32వ వార్డు మహిళల ఆధ్వర్యంలో ఆషాఢ మాసం పురస్కరించుకొని శుక్రవారం బోనాల జాతర నిర్వహించారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు హాజరై నెత్తిన బోనమెత్తుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జిందం లక్ష్మీనారాయణ, పెండెం గణేశ్, కాలనీవాసులు చింతకింది సత్యనారాయణ, వెంకటేశ్, వంశీ, సాగర్, గంగలక్ష్మి, రమ, మణి, సుప్ప, పద్మశాలీ సంఘం నాయకులు శ్రీనివాస్, నాగభూషణం, ధనుంజయ్, మధు, ప్రసాద్, లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు అనిల్, గంగాధర్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దు

మురుగు కాలువను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల అర్బన్, జూలై 26: ప్రతి ఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి సూచించార